## ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అమరేందర్‌రెడ్డి

తుర్కయాంజాల్, ఫిబ్రవరి 24 : ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని తుర్కయాంజాల్ మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని రాగన్నగూడ వార్డు కార్యాలయంలో బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఎల్ఆర్ఎస్ ప్రక్రియను త్వరతగతిన పూర్తి చేయాలని తెలిపారు. ప్రభుత్వం అందజేస్తున్న రాయితీపై ప్రజల్లో అవగాహన కల్పించి ఎల్ఆర్ఎస్ ఫీజులను కట్టించాలన్నారు. వంద శాతం పన్నులను వసూలు చేసి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి దినేశ్, ఆర్‌వో శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

షాబాద్(మొయినాబాద్), ఫిబ్రవరి 24 : పూర్వవిద్యార్థులంతా ఒకచోట కలుసుకున్నారు. మొయినాబాద్ మండల కేంద్రంలోని మెథోడిస్ట్ రూరల్ చిల్డ్రన్స్ ఉన్నత పాఠశాలలో 2000 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా సోమవారం ఓ ఫామ్‌హౌస్‌లో సమావేశం నిర్వహించారు. అప్పట్లో వారికి పాఠాలు బోధించిన గురువులను సన్మానించారు. 25 ఏండ్ల తర్వాత చిన్ననాటి స్నేహితులు ఒక చోట కలుసుకోవడంతో ఒకరినొకరూ అప్యాయంగా పలకరించుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీ టీం సిబ్బంది

యాచారం, ఫిబ్రవరి 24 : విద్యార్థులు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలని రాచకొండ షీ టీం సిబ్బంది సంగీత, ఎల్లమ్మ తెలిపారు. మండల పరిధిలోని కుర్మిద్ద ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు షీ టీం ఆధ్వర్యంలో సోమవారం పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫోన్‌లో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ తదితర వాటికి దూరంగా ఉండాలన్నారు. చదువుపై ఏకాగ్రత పెంచుకోవాలని వారు సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా వెంటనే 100 నంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. బాలికలకు కరాటే శిక్షణను ఇప్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పాండురంగారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యం.. ఇదిగో సాక్ష్యం!

- లోయపల్లిలో వృథాగా పోతున్న నీరు
- పట్టించుకోని అధికారులు



గ్రామ పంచాయతీ పక్కన వృథాగా పోతున్న నీరు

మంచాల, ఫిబ్రవరి 24 : రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు సమావేశాలు ఏర్పాటు చేసి సూచిస్తున్నారు. తాగునీటి సమస్యను అధిగమించడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో సలహాలు ఇస్తున్నారు. మంచాల మండల పరిధిలోని లోయపల్లి గ్రామంలోని ఏ వీధి చూసినా పంచాయతీ బోరు బావి నుంచి నిరంతరం నీటి వృథా అవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. తాగునీటి వృథాను అరికట్టలేరా అని పలువురు వాపోతున్నారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడడంతో పాటు పైపులైన్ లీకేజీల మరమ్మతులను ఎప్పటికప్పుడు చేపట్టాలని మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ ప్రత్యేకాధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి సూచనలు ఇస్తున్నా.. అవి మాటలకే పరిమితమయ్యాయని పలువురు వాపోతున్నారు.



లోయపల్లిలో బోరుబావి నుంచి వృథాగా పోతున్న నీరు



పశువుల తొట్టి వద్ద 24గంటలు ఇలా వృథాగా పోతున్న నీరు

## కొనసాగుతున్న ఉపాధి హామీ పనులు



లేమామిడిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న టీఏ నీలకంఠబాబు

కేశంపేట, ఫిబ్రవరి 24 : ప్రభుత్వం చేపట్టిన ఉపాధి హామీ పనులు మండల పరిధిలో కొనసాగుతున్నాయి. సోమవారం మండలంలోని బొదునంపల్లి, లేమామిడి గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి పనులను టీఏ నీలకంఠబాబు పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఎండలు ముదరకముందే పనులకు రావాలని, ఎండ తీవ్రత ప్రారంభం కాకముందే ఇళ్లకు వెళ్లాలన్నారు. పనులు చేస్తున్న సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఎవరైనా అనారోగ్యంగా ఉంటే ఆరోగ్యం కుదుటపడేంతవరకు ఇంటి వద్ద ఉండాలని సూచించారు.

## చేగూరులో స్వయం పరిపాలన దినోత్సవం



టీచర్లుగా మారిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నందిగామ, ఫిబ్రవరి 24 : మండల పరిధిలోని చేగూరులో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం తావుర్యానాయక్, ఉపాధ్యాయులు అనందశ్రీ, లక్ష్మీప్రసన్న, గాయత్రి, మంజుల, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఆర్డీవో చంద్రకళ

## పరిశీలించి.. వెంటనే పరిష్కరిస్తాం

చేవెళ్లటౌన్, ఫిబ్రవరి 24 :ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరిస్తామని చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ తెలిపారు. సోమవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి రెండు ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజావాణి ద్వారా ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపి.. పరిశీలించిన వెంటనే పరిష్కరించేలా కృషి చేస్తానని తెలిపారు. రెవెన్యూ సమస్యలపై చేవెళ్ల మండల పరిధిలో నుంచి రెండు ఫిర్యాదులు అందాయని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్య, డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్, జూనియర్ అసిస్టెంట్ సంధ్య, ఆపరేటర్ సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

## భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో అనంతరెడ్డి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 24 : మండల పరిధిలోని ఎలిమినేడులో టీఎస్ఐఐసీ ద్వారా సేకరించిన భూములకు సంబంధించిన పేద రైతులకు ప్రభుత్వం సరైన న్యాయం చేయాలని ఎలిమినేడు భూపోరాట సమితి అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి కోరారు. సోమవారం ఎలిమినేడు పంచాయతీ ఆవరణలో రైతులు, అఖిలపక్ష నాయకులతో ఆర్డీవో అనంతరెడ్డి, ఏసీపీ కేపీవీ రాజు, టీఎస్ఐఐసీ మేనేజర్ విజయ్‌కుమార్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తగ్గించిన గుంటలకు పూర్తి పరిహారం చెల్లించడంతో పాటు ఎకరాకు 121 గజాల ఇంటి స్థలం ఇవ్వాలన్నారు. ప్రస్తుతం ఉన్న భూముల ధర ప్రకారం ఎకరాకు రూ.30లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే 2013 చట్టం యాక్టు ప్రకారం పూర్తిగా అమలు చేయాలని కోరారు. అనంతరం మాట్లాడిన ఆర్డీవో అఖిలపక్ష నాయకుల సమక్షంలో రైతుల సమస్యలు పూర్తిగా సేకరించామని, రైతుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, భూ నిర్వాసితులు పాల్గొన్నారు.

## వేసవిలో ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



వేముల్‌నర్వలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు


కేశంపేట, ఫిబ్రవరి 24 : ప్రస్తుత వేసవి సీజన్‌లో ప్రజలు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని జిమ్స్ ఆస్పత్రి వైద్యుడు రఘునందన్ అన్నారు. మైత్రీ యువజన సంఘం ఆధ్వర్యంలో జిమ్స్ ఆస్పత్రి వైద్యులు కేశంపేట మండలంలోని వేముల్‌నర్వలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారులు, వయో వృద్ధులు ఎండలకు బయట తిరగొద్దని, సాధ్యమైనంతవరకు వేసవిలో ఇళ్లల్లో ఉండేందుకు ప్రయత్నించాలన్నారు. 213 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. 13మంది రోగుల ఆరోగ్యం బాగాలేకపోవడంతో జిమ్స్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. కార్యక్రమంలో వైద్యులు మృదుల, సల్మాన్, నాయుడు, సురేశ్‌గౌడ్, గ్రామ కార్యదర్శి లక్ష్మీప్రసన్న, యువజన సంఘం అధ్యక్షులు మనోహర్‌గౌడ్, సభ్యులు మల్లేశ్, ఆనంద్, కార్తీక్, రాఘవేందర్, నవీన్, రాంచందర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఒత్తిడులకు లోనుకావొద్దు




విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆంగ్ల భాష నిపుణుడు సూర్య ప్రకాశ్‌రెడ్డి

చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 24 : విద్యార్థులు పదో తరగతి ఫైనల్ పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిడులు, ఆందోళనకు లోను కావొద్దని ఆంగ్ల భాష నిపుణుడు సూర్య ప్రకాశ్‌రెడ్డి అన్నారు. సోమవారం శంకర్‌పల్లి మండల పరిధిలోని తెలంగాణ మాడల్ స్కూల్, కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోర్డ్ ఎగ్జామ్స్ రాయబోతున్న విద్యార్థులు పరీక్షకు వెళ్లే ముందు భయపడొద్దని, మైండ్‌ని కూల్‌గా ఉంచి వెళ్లాలని, విద్యార్థులు పరీక్షకు ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో మాడల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మండల పరిధిలోని ఎల్గొండగూడకు చెందిన రైతు నర్సింహులుగౌడ్ గ్రామ శివారులో 8 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వరి నాట్లు వేసిన 15 రోజులకే పైరు మొత్తం పాడైపోయింది. గ్రామ సమీపంలోని ఓ పరిశ్రమ కారణంగా భూగర్భ జలాలు కలుషితమై పంటలు పాడై పోతున్నాయని, ఆ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

- షాబాద్, ఫిబ్రవరి 24



శంకర్‌పల్లి మండల పరిధిలోని కొండకల్, వెలిమెల తండా శివారులోని లంబాడ గిరిజనులు తమ 80 ఎకరాల బిలాదాకాల భూముల ఆక్రమణలపై చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 45వ రోజుకు చేరాయి.

- చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 24

## పెండింగ్ పనులను పూర్తి చేయాలి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 24 : ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న రోడ్ల పనులను వెంటనే పూర్తి చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గరిగె శేఖర్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో రోడ్లు వేయించారన్నారు. ఈ పనుల కోసం నిధులు విడుదల చేసినా పనులు చేయడంలో అధికారులు, కాంట్రాక్టర్లు జాప్యం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మంచాల రోడ్డు నుంచి రిజిస్ట్రేషన్ కార్యాలయం వరకు ఉన్న రోడ్డులో గోతులు తవ్వి కంకరపోసి వదిలేశారని పేర్కొన్నారు. ఈ రోడ్డుతో పాటు పలు కాలనీల్లో ఇబ్బందికరంగా మారిన రోడ్లను వెంటనే పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

### నేడు విద్యుత్ వినియోగదారుల సమావేశం

తుర్కయాంజాల్, ఫిబ్రవరి 24 : మున్సిపాలిటీ పరిధిలోని రాగన్నగూడలో ఉన్న ఇబ్రహీంపట్నం డివిజన్ కార్యాలయంలో మంగళవారం విద్యుత్ వినియోగదారుల సమావేశం ఉదయం 10.30 నుంచి ఒంటి గంట వరకు నిర్వహిస్తున్నామని ఆ శాఖ డీఈ నరేశ్‌కుమార్ తెలిపారు. వినియోగదారులకు దీర్ఘకాలికంగా పరిష్కారం కాని సమస్యలు, బిల్లుల హెచ్చు, తగ్గు సమస్యలపై ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవచ్చని తెలిపారు. సమావేశానికి సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్, మెంబర్ టెక్నికల్, మొబైల్ ఫైనాన్స్, కన్స్యూమర్ ఎఫైర్స్ అధికారులు హాజరవుతారని అన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

షాబాద్(మొయినాబాద్), ఫిబ్రవరి 24 : చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని మేడిపల్లికి చెందిన బాసగల్ల యాదయ్య (46) ఈ నెల 19న రాత్రి ఇంట్లో దాహం వేస్తుందని రిఫ్రిజిరేటర్ తలుపునకు బదులుగా ప్రమాదవశాత్తు దాని వెనక వైపు వెళ్లి గట్టిగా వెనక్కి లాగాడు. ఆయన నడుము కింది భాగంలో రిఫ్రిజరేటర్ పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం నగరంలోని గాంధీ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ప్రభుత్వ భూమిలో ఫెన్సింగ్‌తో పాగా వేసే ప్రయత్నం

**పనులను నిలిపివేసిన రెవెన్యూ అధికారులు**



ప్రభుత్వ భూమి కబ్జా చేస్తున్నారని అధికారులకు వివరిస్తున్న స్థానికులు

కేశంపేట, ఫిబ్రవరి 24: ప్రభుత్వ భూమిలో ఫెన్సింగ్‌తో పాగా వేసే ప్రయత్నం చేసిన విషయంలో కేశంపేట రెవెన్యూ అధికారులు స్పందించి పనులను నిలిపివేశారు. స్థానికులు, రెవెన్యూ అధికారుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని బైర్కాన్‌పల్లి గ్రామంలోని 53 సర్వే నంబర్‌లో 360 ఎకరాల భూమి ఉంది. వీటిలో 300 ఎకరాలు పట్టా కాగా 60ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. సర్వే నంబర్ 53/37లో 15ఎకరాలు ఉందని, దానికి ఆనుకొని ఉన్న భూమిని ఓ బడా రియల్ ఎస్టేట్ వ్యాపారి కొనుగోలు చేశాడు. తాను కొనుగోలు చేసిన భూమిని వదిలి ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్ చేసే ప్రయత్నం చేశాడు. ఈ విషయమై గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో తహసీల్దార్ ఆజంఅలీ ఆదేశాల మేరకు ఘటనా స్థలాన్ని ఆర్ఐ నివేదిత పరిశీలించి పనులను నిలిపివేసినట్లు తెలిపారు. ప్రభుత్వ సర్వే పూర్తైన తర్వాత పనులు చేసుకోవాలని, భూమికి సంబంధించిన పత్రాలను తహసీల్దార్ కార్యాలయానికి తీసుకు రావాలని వ్యాపారికి సూచించారు. ఘటనా స్థలాన్ని పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసులు పరిశీలించారు.

## కొనసాగుతున్న కంటి పరీక్షలు



కంటి పరీక్షలను పరిశీలిస్తున్న ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 24: ఆర్‌బీఎస్‌కే టీం ఆధ్వర్యంలో షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖానలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రతి రోజూ కంటి పరీక్షల కార్యక్రమం కొనసాగుతుందని దవాఖాన సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం కంటి పరీక్షల కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. ఆర్‌బీఎస్‌కే టీం సభ్యులు ప్రభుత్వ పాఠశాలల్లో కంటి లోపాలు ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖానలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారని, కంటి చూపునకు తగిన విధంగా కంటి అద్దాలను ఇస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు రానున్న రోజుల్లో వార్షిక పరీక్షలు ఉన్న నేపథ్యంలో కంటి చూపు సమస్యలు తలెత్తకుండా కంటి పరీక్షలను ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. ప్రతి రోజూ షాద్‌నగర్ డివిజన్‌తో పాటు శంషాబాద్, మహేశ్వరం, ఆమనగల్ నుంచి విద్యార్థులను తీసుకొచ్చి కంటి పరీక్షలు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు సుమారు 2581మంది విద్యార్థులు కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. వేసవికాలం దృష్ట్యా కంటి పరీక్షలకు వచ్చిన విద్యార్థులకు సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్ విద్యార్థులకు వాటర్ బాటిళ్లు, బిస్కెట్లను అందజేశారు. కార్యక్రమంలో కంటి వైద్యుడు సౌజన్య, డాక్టర్లు పద్మలత, పుష్పలత, ఆప్తమాలజిస్టులు రమేశ్, నరేందర్‌రెడ్డి, చంద్రశేఖర్,ఆర్‌బీఎస్‌కే వైద్యులు డాక్టర్లు విజయలక్ష్మి, సంధ్య, రాగిణి, కార్తీక్, సంధ్య, ఫార్మసిస్టులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

## కరాటేలో విద్యార్థుల ప్రతిభ



కరాటేలో పథకాలు సాధించిన విద్యార్థులు

కొందుర్గు, ఫిబ్రవరి 24 : న్యూమాంక్స్ కుంగ్ ఫూ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటేలో కొందుర్గు విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన 3వ జిల్లా స్థాయి టోర్నీలో ఉమ్మడి జిల్లాలోని మార్షల్ ఆర్ట్స్‌కు సంబంధించిన టీంలు పాల్గొన్నాయి. ఎదిర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి హర్షవర్ధన్ కథాస్ విభాగంలో మొదటి బహుమతి సాధించారు. ఇంద్రానగర్ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ప్రణవి బాలికల విభాగంలో కథాస్‌లో ప్రతిభను కనబరిచింది. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కిరణ్‌కుమార్, ఉదయ్‌కుమార్ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాల్, రవికుమార్, చైతన్య, లక్ష్మి, శ్రీలత, సంగీత, రమేశ్, సంజీవ, నర్సింహులు, కరాటే మాస్టర్ రాజు, విద్యార్థుల తల్లిదండ్రులు యాదయ్య, రాజు, అంజి తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం




ఆమనగల్లులో డీసీసీబీ ఎదుట ప్రమాదకర స్థితిలో ఉన్న విద్యుత్ స్తంభం

ఆమనగల్లు, ఫిబ్రవరి 24 : పట్టణంలోని డీసీసీబీ ఎదుట ఉన్న విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. ఎప్పుడు కూలిపోతుందేమోనని స్థానికులు, బ్యాంకు ఖాతాదారులు భయాందోళనకు గురవుతున్నారు. హైదరాబాద్ శ్రీశైలం జాతీయ రహదారిపై ఇంత ప్రమాదకర పరిస్థితిలో విద్యుత్ స్తంభం ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం బ్యాంకుకు వందలాది మంది ఖాతాదారులు వస్తూ.. పోతుంటారు. అలాగే జాతీయ రహదారి కావడంతో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు జరుగుతున్నాయి. ఇలాంటి రద్దీ ప్రాంతంలో విద్యుత్ స్తంభం దురదృష్టవశాత్తు కూలిపోతే భారీగా ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరుగుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

పెద్దఅంబర్‌పేట, ఫిబ్రవరి 24: మున్సిపాలిటీ పరిధిలోని పసుమాముల గ్రామం కళానగర్ పోచమ్మ గుడి దగ్గర సర్వే నంబర్ 386/1 ప్రభుత్వ భూమి చెరువు శిఖం స్థలంలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన గూడెపు మధు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ భూమిని ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, ఎఫ్‌టీఎల్‌లో వేసిన సీసీ రోడ్డును తొలగించాలని కోరారు.

## వివాహిత అదృశ్యం



మంజుల (ఫైల్)

కడ్తాల్, ఫిబ్రవరి 24 : ఇద్దరు పిల్లలతో కలిసి వివాహిత అదృశ్యమైన ఘటన కడ్తాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాలు.. తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ గ్రామానికి చెందిన చౌటి మంజుల (32) వివాహం కడ్తాల్ మండల పరిధిలోని వంపుగూడెం గ్రామానికి చెందిన పోతుగంటి శేఖర్‌తో 15 ఏండ్ల క్రితం జరిగింది. వీరికి నలుగురు సంతానం ఉన్నారు. ఏడాదిగా మద్యానికి బానిసైన శేఖర్... భార్యను మానసికంగా, శారీరకంగా వేధించసాగాడు. ఈ విషయమై గతంలో పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టినా.. శేఖర్‌లో ఎలాంటి మార్పు రాలేదు. మంజుల భర్త వేధింపులు తట్టుకోలేక ఈ నెల 22న ఆమనగల్లులో చదువుతున్న పిల్లల దగ్గరికి వెళ్లి వస్తానని చెప్పి... ఇంట్లో ఉన్న మల్లేశ్ (6), అనూష (7)తో ఇంటి నుంచి వెళ్లింది. పిల్లలతో బయటికి వెళ్లిన మంజుల రెండు రోజులైన ఇంటికి రాలేదు. మంజుల తమ్ముడు అంజయ్య సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## బంగారు గొలుసు చోరీ

చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 24 : కల్లు విక్రయిస్తున్న మహిళ మెడలోంచి బంగారు గొలుసు లాక్కొని పారిపోతున్న ఓ దుండగుడిని స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించిన ఘటన శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాలు.. శంకర్‌పల్లి మండల పరిధిలోని కొత్తపల్లిలో ఉన్న కల్లు దుకాణంలో సోమవారం మధ్యాహ్నం సమయంలో కల్లు విక్రయిస్తున్న కల్వేముల సులోచన మెడలోంచి 3.5 తులాల బంగారు గొలుసును చేవెళ్ల మండల పరిధిలోని తల్లారం గ్రామానికి చెందిన ఖానాపురం మురళి (26) లాక్కొని పారిపోతుండగా కొత్తపల్లి గ్రామానికి చెందిన మహ్మద్ హబీబ్, మరి కొందరు అతన్ని వెంబడించి పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు సులోచన భర్త రాజు గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మురళిని పట్టుకున్న యువకులను సీఐ శ్రీనివాస్ గౌడ్ ప్రత్యేకంగా అభినందించారు.